ఊసేలేని జగనన్న టౌన్ షిప్...

- స్థల సేకరణకూ నోచని పథకం - దరఖాస్తుదారుల ఆశలు అడియాశలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రతి మున్సిపాలిటీలో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లు ఏర్పాటు చేస్తామని, వాటిలో స్థలాలు కొనాలనుకున్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది మధ్య తరగతి ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్లు దాటినా ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో ఎమ్మిగనూరులో కాకుండా మిగిలిన ఏడు మున్సిపాలిటీల పరిధిలో ఇంతవరకు స్థల సేకరణే జరగకపోవడంతో పథకం అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో స్మార్ట్ టౌన్ షిప్‌లో స్థలాల కోసం 13 వేల మందికి పైగా మధ్య తరగతి ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 150, 250, 300 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ప్రభుత్వం చెప్పింది. లేఅవుట్లలో రహదారులకు 30 శాతం, ఖాళీ స్థలాలకు 10 శాతం, మౌలిక వసతులకు ఐదు శాతం, ఆస్పత్రులు, కమ్యూనిటీ భవనాలకు ఒక శాతం చొప్పున స్థలాలు కేటాయిస్తామని గొప్పగా ప్రకటించింది. పాఠశాలలు, 2 ఆస్పత్రులు, నిత్యావసరాలు, బ్యాంకులు, వార్డు సచివాలయం, అంగన్వాడీ కేంద్రాలు, పిల్లలకు ఆట స్థలాలు అందుబాటులో ఉంటాయంది. వీటికితోడు వీధి దీపాలు, డ్రెయినేజీ, విద్యుత్, సౌర దీపాలతో పాటు అన్ని వసతులూ కల్పిస్తామని, ఉద్యానవనాలు ఏర్పాటు చేస్తామని చెప్పడంతో చాలామంది ప్రజల్లో ఆశలు చిగురించాయి. ఇంతవరకు స్థలాల సేకరణే జరగలేదు. ఈ పథకం ఉంటుందో లేదో తెలియడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎనిమిది మున్సిపాలిటీల్లో స్మార్ట్ టౌన్ షిప్‌కు సుమారు 500 ఎకరాల

స్థలం సేకరించాల్సి ఉంది. ఇందులో భాగంగా కర్నూలు నగరపాలక సంస్థతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ పురపాలక సంఘాల శివారు ప్రాంతాల్లో పలుమార్లు అధికారులు వివిధ రకాల భూములను పరిశీలించారు. కొన్ని భూములను గుర్తించి సంబంధిత రైతులతో సమావేశాలు కూడా నిర్వహించారు. భూములు తీసుకుంటే తమ జీవనం ఎలా అని కొందరు రైతులు ప్రశ్నించారు. కర్నూలు, నంద్యాల వంటి పట్టణాల్లో ఎకరా ధర కనిష్టంగా రూ.5 కోట్ల వరకు ఉంది. ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ వంటి పట్టణాల్లో ఎకరా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు, మిగతా మున్సిపాలిటీలో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ధరలు ఉన్నాయి. ఈ ధరలతో కొనుగోలు చేయడానికి ఏడాదిన్నరగా అధికారులు వివిధ ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వానికి నివేదిక కూడా పంపారు. పట్టణాలకు 5 కిలోమీటర్ల దూరంలో స్థల సేకరణకు చేసిన ప్రయత్నాలు ఎక్కడా ఫలించలేదు. ఇదే సమయంలో నంద్యాల, ఆత్మకూరు, డోన్, ఆదోనిలో అధికారులు గుర్తించిన భూములపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో ఆ ప్రతిపాదనలు తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత ఈ పథకం ఊసే లేకుండాపోయింది.

న్యాయ రాజధాని ఎక్కడ?

- లా యూనివర్సిటీ పేరుతో సర్కార్ ఏగనామం

- 100 ఎకరాల భూ కేటాయింపునకు ఆమోదముద్ర - ఈ నిర్ణయం ఎన్నికల లబ్ధి కోసమేనా?

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గతంలో అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ ప్రకటనకు అనుగుణంగా ఇప్పటివరకు ఎక్కడ అడుగులు పడలేదు. ఇప్పుడు జగన్ సర్కారు మరో నిర్ణయం తీసుకుంటూ ప్రజలను మధ్య పెట్టేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా నేషనల్ యూనివర్సిటీ ఏర్పాటుకు వంద ఎకరాల భూ కేటాయింపులు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మూడు ప్రాంతాలలో మూడు రాజధానులను ఏర్పాటు చేయడమే తమ అజెండాగా జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రకటనలు చేస్తూ వస్తుంది. ఇందులో భాగంగా పరిపాలన రాజధాని విశాఖకు న్యాయ రాజధాని కర్నూలులో శాసన రాజధాని అమరావతిలో పెడుతున్నట్లు ప్రకటించింది. కర్నూలులో న్యాయ రాజధాని సంబంధించి ఏర్పాటుపై ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతుంది. ఇటీవల సుప్రీంకోర్టులో మూడు రాజధానుల అంశంపై జరిగిన కేసులో హైకోర్టు అమరావతిలోనే ఉన్నట్లు అఫడవిట్ దాఖలు చేసింది. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు సంబంధించి జగన్ సర్కార్ కేవలం ఎన్నికల అజెండాగానే తీసుకొని ముందుకు వెళ్లేందుకు సన్నద్ధమైంది. ఇందులో భాగంగా మరోసారి కర్నూలులో నేషనల్ లా యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం నిర్ణ వేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాయలసీమ జిల్లాలో అధికార వైసిపికి బలమైన ఓటు బ్యాంకు ఉంది. ఇందులో భాగంగా 2019 సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు రెండు పార్లమెంటు స్థానాలను అధికార పార్టీ కైవసం చేసుకుంది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న ఆరు నెలల తరుణంలో మరోసారి న్యాయ రాజధాని పేరుతో ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా నేషనల్ లాయూనివర్సిటీకి భూ కేటాయింపులు చేయడం పట్ల ఎన్నికల ఎత్తుగడలో భాగమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలనేది అప్పుడు తీర్మానించుకున్నారు. హైకోర్టుకు అనుబంధంగా ఉన్న మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్ బోర్డ్ ట్రిబ్యునల్ లాంటి రాష్ట్ర స్థాయి కార్యాలయాలను కర్నూలులో పెట్టి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. హైకోర్టు కార్యకలాపాలను మాత్రం అమరావతి నుండి కొనసాగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవిభజన అనంతరం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున ప్రతిపక్షాలు ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 2014 సాధారణ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. మరోసారి జగన్ మోహన్ రెడ్డి నాలుగున్నర సంవత్సరాలుగా కర్నూలులో హైకోర్టు ఏర్పాటుపై కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమై కార్యరూపం మాత్రం దాల్చలేకపోయారు. ఆరు నెలల్లో సాధారణ ఎన్నికలు తరుము కొస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఓట్లను పొందేందుకు మళ్లీ రాజకీయ లబ్ధికి తెర లేపారు. సిపిఎం ప్రజా రక్షణభేరీ పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్రలో భాగంగా అనేక ప్రజా అంశాలను పెట్టుకొని యాత్రను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ కూడా ఉంచడం పట్ల పలువురు సిపిఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. ఇప్పటికైనా కర్నూలులో న్యాయ రాజధాని పేరుతో ఓట్ల రాజకీయం కాకుండా చిత్తశుద్ధితో ఇక్కడ హైకోర్టును ఏర్పాటు చేయాలని ప్రజలు పాలక ప్రభుత్వాలను కోరుతున్నారు.

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించండి

- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి- దేవనకొండ

'జగనన్నకు చెబుదాం, స్పందన' అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి... ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జెసి నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో 'జగనన్నకు చెబుదాం - స్పందన' నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడారు. అర్జీలలో రెవెన్యూ, నీటి సమస్యలు, పారిశుధ్యంపైన అధికంగా వచ్చాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. మండలాల్లో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం-స్పందన'కు సంబంధిత మండలాల్లోని గ్రామాల విఆర్ఒలు కూడా వచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని ఇన్‌ఛార్జి సిపిఒను ఆదేశించారు. పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, దేవనకొండ తహశీల్దార్ వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం అందిస్తున్న బాధితులు

ఇళ్ల మధ్య గుంతలకు మరమ్మతు చేయాలి

- ఖలీల్ వాడిలో పైపులైనుకు 8 అడుగుల గుంతలు - సిపిఎం బృందం డిమాండ్

ఖలీల్ వాడిలో పర్యటిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని తొమ్మిదో వార్డు ఖలీల్ వాడిలో మంచినీటి పైపులైన కోసం ఇళ్ళ సందులలో 8 అడుగుల లోతు గుంతలను తవ్వి పది రోజులవుతున్నప్పటికీ ఏమాత్రం మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేసిన కమిషనర్ వైఖరిని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి ఖండించారు. గౌస్ దేశాయ్ నాయకత్వంలో నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్. మొహమ్మద్ షరీఫ్, డి.అబ్దుల్ దేశాయ్, కె.రామకృష్ణల బందం ఖలీల్‌వాడిలో పర్యటించింది. 30 సంవత్సరాలుగా మంచినీటి సమస్య అక్కడ తీవ్రంగా ఉందని ,అనేకమార్లు సిపిఎం నాయకత్వంలో అబ్దుల్ దేశాయ్ ,స్థానిక కార్యకర్తలను సమీకరించి పోరాటాలు చేసిన ఫలితంగా ఖలీల్‌వాడికి పైపులైను మంజూరు అయ్యిందన్నారు. దీంతో సంతోషంగా ఉంటే మరో వైపు నుంచి పని చేసుకుంటూ రావాల్సిన అధికారులు ,కాంట్రాక్టర్లు ఇష్టానుసారం తవ్వడం వల్ల ప్రజలకు రాకపోకలకు తీవ్రమైన అసౌకర్యం ఏర్పడిందన్నారు. సమస్యపై డి. గౌస్ దేశాయ్ ,ఎం. రాజశేఖర్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమని ,ఎంఇ, డిఇలు ఏం చేస్తున్నారని అన్నారు. గుడ్డి గుర్రానికి పండ్లు తోముతున్నారా అని వారు ప్రశ్నించారు?. నగరంలో ఒక మేజర్ పని జరుగుతున్న స్థలాన్ని సందర్శించాల్సిన బాధ్యత అధికారులకు లోకల్ ఎమ్మెల్యే కార్పొరేటరుకు లేదా అని ప్రశ్నించారు. వారికి ఇంకిత జ్ఞానం లేదా అని వారు నిప్పులు చెరిగారు. ఇటువంటి మేజర్ సమస్య ఉన్న ప్రాంతంలో కాంట్రాక్టర్ అధికమంది కార్మికుల సంఖ్యను పెంచి రెండు రోజులలో పని పూర్తి చేయాలని లేని పక్షంలో పూల బజార్‌లో ఇక్కడి స్థానిక జనాన్ని సమీకరించి పెద్ద ఎత్తున రాస్తారోకో చేస్తామని పాలకవర్గానికి అధికారులను హెచ్చరించారు. మహమ్మద్ హుస్సేన్, ఇలియాజ్, గోరెబై, సత్యం, ఫయాజ్, ముసామియా, రఫీ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు చర్యలు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్ ఎస్పీలను ఆదేశించారు. శుక్రవారం ఆయన విజయవాడ నుండి జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్‌పి స్థాయి ఉన్నతాధికారులకు వీడియో కాన్ఫరెన్స్ చేపట్టారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ మానవ వనరులకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సెక్టోరల్ ఆఫీసర్లును 233 మందిని ఏర్పాటు చేశామన్నారు. ఇంకా అసిస్టెంట్ డిఇఒను నియమించాల్సి ఉందన్నారు. మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్‌ఆఫీసర్లు, పోలింగ్ ఆఫీసర్లు సరిపడా ఉన్నారన్నారు. డిస్పాచ్‌సెంటర్, రిసెప్షన్‌సెంటర్, స్ట్రాంగ్‌రూమ్‌కు సంబంధించి 2న జిల్లా ఎస్‌పితో కలసి రాయలసీమ యూనివర్సిటీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను చర్చించామని, పాణ్యం అస్లెంబ్లీ నియోజకవర్గం నంద్యాల జిల్లాలోకి వస్తుందని, ఇఆర్ఒ కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ ఉన్నారని, నంద్యాల కలెక్టర్‌తో సంప్రదించి ఏర్పాట్లు చేసుకుంటామని సిఇఒకు తెలిపారు. ఎటువంటి మిలిటెన్సీ ప్రభావం లేదన్నారు. సెక్టోరల్ ఆఫీసర్లు రేపటి కల్లా నియమించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ గత ఎన్నికలలో రాష్ట్ర పోలీసులకు సంబంధించి 2609 మంది పోలీసులు అవసరం ఉండగా కేవలం 1883 మంది మాత్రమే వినియోగించుకున్నామన్నారు. ప్రస్తుత ఎన్నికలకు సంబంధించి 3130 మంది అవసరం ఉండగా, 2260 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారన్నారు. జిల్లా పోలీసులతో పాటు కర్ణాటక పోలీసులను వినియోగించుకున్నారని తెలిపారు. వాహనాలకు సంబంధించి సుమారు 400 వరకు అవసరమవుతాయని,. జిల్లాలో ఆయుధాల లైసెన్స్ కలిగిన వారు 631 మంది ఉండగా వారిలో 598 మంది డిపాజిట్ చేశారని మిగతావి బ్యాంకుల భద్రత నిమిత్తం వినియోగించుకుంటున్నారన్నారు. జిల్లా సరిహద్దుల్లో మద్యం రవాణాను అరికట్టడానికి కర్ణాటక బోర్డర్‌లో13 చెక్ పోస్టులు, తెలంగాణ వైపు 2 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని ఎస్‌పి వివరించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంచార్జి డిఆర్ఒ, ఇఆర్ఒ మల్లిఖార్జునుడు పాల్గొన్నారు.

సర్దార్ బాష మృతి యూనియన్‌కు తీరని లోటు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఎడిసిగా పనిచేస్తున్న సర్దార్‌బాష మతి తీరని లోటని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి దివాకర్ అన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజినల్ గౌరవ అధ్యక్షులు అంజిబాబు అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో దివాకర్ వివిఎస్.రాయుడు తదితరులు మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగంలో చేరినప్పటి నుండి మరణించేంతవరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే వారన్నారు. ఆయన ఆశయాలు సాధించాలంటే యూనియన్‌ను బలోపేతం చేయడమే మన ముందున్న కర్తవ్యమని అన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల ఆర్‌టిసిలో ఉన్న కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటికి వ్యతిరేకంగా మనమంతా కూడా పోరాటాలకు సిద్ధం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, నాయకులు సాయిబాబా, విజయ్, నాగేశ్వరరావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు శేఖర్, దేవరాజు, ఆంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

ఆచార్య ఫజులుర్ రహెమాన్‌ను సన్మానించిన మేధావుల వేదిక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డాక్టర్ అబ్దుల్‌హఖ్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్యఫజులర్ రహెమాన్‌ను కర్నూలు జిల్లా మేధావుల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఉన్నత విద్యారంగానికి మేలు జరిగేలా విలువైన సేవలను ఆయన అందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య మన్సూర్ రహ్మాన్ మాట్లాడుతూ ఫజులుర్ రహరెమాన్ కృషి కారణంగా నేడు 3220 విశ్వద్యాలయ అధ్యాపకుల నియామకాలకు మార్గం సుగమమయిందని అన్నారు. ఉన్నత విద్యారంగంలో ఇది కీలకమలుపు కాగలదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రతిభావంతుడైన ఆచార్య ఫజులుర్ రహెమాన్ సారధ్యంలో ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రస్తుత సమస్యలను అధిగమించి జాతీయస్థాయిలో కీర్తిని సాధించగలదని , వారికి జిల్లా మేధావులు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉర్దూవిశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి.శ్రీనివాసులు, డాక్టర్ అక్తర్‌బాను, డాక్టర్ మహబూబ్‌బాష, డాక్టర్ బి.వెంకటప్ప, అబుబకర్ పాల్గొన్నారు. కర్నూలు జిల్లా మేధావుల కన్సార్టియం తరపున గాడిచర్ల ఫౌండేషన్, రాయలసీమ ఎకానమిక్ అసోసియేషన్, సాహితీ దస్సు, మానవశక్తి పరిశోధనా కేంద్రం ఉపకులపతిని అభినందించాయి.

ఆర్‌యులో నాలుగేళ్ల డిగ్రీ కోర్సుకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఆర్‌యులో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు బికాం హానర్స్, ఎకనామిక్స్ , బికాం హానర్స్ కామర్స్ కోర్సుల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ సుందరానంద శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14 లోగా వర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని 16వ తేదీన విద్యార్థులకు సీట్లకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు జగనన్న వసతి , విద్యా దీవెన కూడా అందుతాయన్నారు.

సి బెళగల్ ఎస్ఐగా ఎం విజయ్ బాధ్యతలు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ ఎస్ఐగా మన్మధ్ విజయ్ శుక్రవారం మాజీ ఎస్ఐ పీరయ్య సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. పీరయ్య గూడూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు విఆర్ నుండి వచ్చి బాధ్యతలు స్వీకరించి పోలీస్ సేవలను మెరుగు పరుస్తానని మీడియాలో పేర్కొన్నారు.

'ఆరోగ్య సురక్ష' దేశానికే ఆదర్శం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికి ఆదర్శమని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు 46వ వార్డు అశోక్ నగర్ పోస్టాఫీస్ సమీపంలో 120వ సచివాలయంలోని జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరాన్నికార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు నగరూరు శ్రీనివాస్‌రావుతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ... ప్రజారోగ్య వ్యవస్థకు జగనన్న ప్రాణం పోశారని అన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ప్రారంభించిన ముఖ్యమంత్రి 5 వేల మందికిపైగా డాక్టర్లతో 1.67 కోట్ల కుటుంబాలను కవర్ చేస్తూ, 14 రకాల డయాగ్నోస్టిక్ కిట్స్, 172 రకాల మందులతో ఉచిత ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రభుత్వం నిర్వహిస్తున్నారన్నారు. నవంబర్ 15 వరకు 10,032 వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్, 542 అర్బన్ హెల్త్ క్లినిక్స్ వారీగా షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాల ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ ఏ నాయకుడు ఆలోచించని విధంగా పేద ప్రజల ఆరోగ్యం కోసం గౌరవ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రజల చెంతకే వైద్యం వచ్చి నిలిచిందన్నారు. గ్రామ సచివాలయాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత వైద్య సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటిని ప్రతి కుటుంబాన్ని ప్రతి వ్యక్తిని ఆరోగ్య పరంగా సురక్షితంగా ఉంచడమే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 45 రోజులపాటు నిర్వహించే 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులను లాంఛనంగా ముఖ్యమంత్రి పాటుపడుతున్నారన్నారు. ఏడు రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతోపాటు ఏమైనా ఆరోగ్య సమస్యలు వుంటే స్పెషలైజేషన్ డాక్టర్లకు చూపించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ప్రెసిడెంట్ సితార ఇర్ఫాన్, భాస్కర్ రెడ్డి, యూసుఫ్, మల్లికార్జున, రామ్ చంద్రారెడ్డి, చందు సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

దేశాయి తండాకు తాగునీరివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి- తుగ్గలి : తుగ్గలి మండలం దేశాయి తండాలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని జొన్నగిరి గ్రామ సచివాలయంలో దేశాయితండా కాలనీవాసులతో సిపిఎం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాయితండాలో గత సంవత్సరం నుండి నీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందని ఆందోళనలు ధర్నాలు చేశారు. సిపిఎం తరఫున ప్రజల సమక్షంలో పోరాడుతుంటే పోలీసులు ఎమ్మెల్యేకు అర్జీ ఇవ్వకుండా చేశారన్నారు. నీటి సమస్య ఎక్కువగా ఉండడంతో దూర ప్రాంతాల నుండి ప్రజలు నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తమ

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ఆందోళనను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి మాత్రం ప్రతి గ్రామంలో నీటి సమస్యను తక్షణమే పరిష్కారిస్తామని ఒక ప్రక్క చెబుతున్నప్పటికీ. ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి దేశాయితండాలో ఉన్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, నాగరాజు, సూరి, రవి దేశాయి తండా కాలనీవాసులు పాల్గొన్నారు. పై సమస్యలు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని పంచాయతీ కార్యదర్శి గోపాల్ వారికి హామీ ఇచ్చారు.

ప్రజాధనం వృధా చేస్తున్న మున్సిపల్ ఇంజనీర్లు

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విచారణ చేయించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అవసరం లేని అభివృద్ధి పనులు చేస్తూ మున్సిపల్ ఇంజనీర్లు కోట్ల ప్రజాధనం వధా చేస్తున్నారు. ఒక ఇంజనీరు కాలువలు కల్వర్టులు నిర్మించి బదలీ అవుతాడు.మరో ఇంజనీరు వచ్చి ఆ కాలువలను, కల్వర్టులు లెవెల్ గా లేవని వాటిని కూలగొట్టి ప్రజాధనాన్ని వృధా చేస్తారు. కర్నూలు నగరపాలక సంస్థ ఇంజనీర్లపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. అశోక్ నగర్ లో గతంలో ఇంజనీరు దాదాపు రూ.20 లక్షలతో వాటర్ వర్క్స్ నీళ్లు, మురుగు నీళ్లు వెళ్లడం కోసం పెద్ద కల్వర్టు, రెండు కాలువలు నిర్మించారు. శుక్రవారం మున్సిపల్ ఇంజనీర్లు కాంట్రాక్టర్ ద్వారా బాగున్న కల్వర్టు పక్కనే మరో కల్వర్టు కోసం సిమెంట్ రోడ్డును కూలగొడుతుండగా పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా

వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు కొందరు ఇంజనీర్లు కుమ్మక్కై అవసరంలేని అభివృద్ధి పనులు చేస్తూ ఎవరి వాటావాళ్ళు పంచుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయని అన్నారు. వెంటనే ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ నిరసనలో సివిఆర్‌కె. శ్రీనివాసులు, ఎస్. షమీవుల్లా, మధు తదితరులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మేయర్ బివై.రామయ్య

నాణ్యత ప్రమాణాలు పాటించాలి : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 34వ వార్డులో రూ.40 లక్షలతో పార్కు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ, అదే వార్డులో రూ.1.15 ఒక కోటి పదిహేను లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే, నగర మేయర్ భూమిపూజ చేశారు. వార్డు కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యసురక్షపై సర్వత్రా హర్షం : కర్నూలు నగర మేయర్ బివై రామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న కల్లూరు అర్బన్ 19 వ వార్డులో 'జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమం నిర్వహించారు. ఎమ్యెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష' కార్యక్రమం గురించి రాష్ట్రంలోని పేద ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పాణ్యం నియోజకవర్గ పరిధి నాలుగు మండలాల్లోని 9 మంది బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధికింద వచ్చిన రూ.15 లక్షల చెక్కులను సంబంధిత అర్హులకు ఎమ్యెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అందజేశారు.

పుసులూరులో టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత

టిడిపి తోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. గౌరు చరిత ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీని కల్లూరు మండలం పుసులూరులో నిర్వహించారు. గౌరు చరితారెడ్డి నాయకులు, కార్యకర్తలు కలిసి ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, మాజీ ఎంపిపి వాకటి మాధవి, మాదేష్, పుసులురు నాయకులు ఆర్‌బి.కృష్ణ, సర్పంచి రాముడు, సుందరం, తిమ్మారెడ్డి, లింగా రెడ్డి, ఐటిడిపి వెంకటేష్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆలూరురూరల్

వ్యవసాయ పంపు సెట్లకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్ డిఈ కార్యాలయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశులు, రైతుసంఘం మండల అధ్యక్షులు శేఖర్ మాట్లాడారు. గత 15 రోజుల నుంచి అకస్మాత్తుగా 9 గంటల నుంచి 7 గంటలకు తగ్గించారని చెప్పారు. పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి విద్యుత్ కోత వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికే కరువుతో అల్లాడుతున్న రైతులకు ఇది కోలుకోలేని దెబ్బ అని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే 9 గంటల విద్యుత్ ఇచ్చి ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎఇ చెన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం మండల సభ్యులు హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి - మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

అర్హత కలిగిన వారికి ఉద్యోగ, ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తరచూ ఉద్యోగ ఎంపికకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సిటెక్, రేడియంట్ సెల్కాన్ ఎలక్ట్రికల్ ప్రయివేట్ లిమిటెడ్, శ్రీరామ్ చిట్స్ అండ్ లైఫ్ ఇన్స్యూరెన్స్, ఎస్‌కె బయో ఎంటర్‌ప్రైజెస్, ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్, నవభారత్ ఫర్టిలైజర్స్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, అమర్ రాజా గ్రూప్, ఫ్లిప్ కార్డ్, సిఎంఆర్ ఈకో అల్యూమినియం ప్రయివేట్ లిమిటెడ్, ఆటో సెన్స్, మితు భాష, ఆస్ట్రో స్టీల్స్, వివిధ కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. ఆదోని మున్సిపల్ ఛైర్మన్ బి.శాంత, ఆదోని మార్కెట్ యార్డు ఛైర్మన్ మజర్ అహ్మద్, వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరస్పాండెంట్ సిఎబి.దైవాధీనం రెడ్డి, ఆదోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత రెడ్డి, నరసింహ మూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలసలు...

- కోసిగి నుంచి తెలంగాణ రాష్ట్రానికి కూలీలు

ప్రజాశక్తి - కోసిగి

కోసిగిలోని 1వ వార్డు ప్రజలు శుక్రవారం తెలంగాణ రాష్ట్రం బెల్లంపల్లికి పిల్లాపాపలతో పత్తి పనులకు వలస వెళ్లారు. ఖరీఫ్ సీజన్లోను వర్షాలు సరిగా కురవకపోవడంతో వేసిన పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. పంటలను పొలాల్లోనే వదిలేసి బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పత్తి పనులు మొదలయ్యాయని, అక్కడ కిలో రూ.10 ఇస్తారని, ఎంత చేసుకుంటే అంత కూలి వస్తుందని కూలీలు తెలిపారు. ప్రతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల వేసిన పంటలన్నీ పూర్తిగా నష్టపోయాయని వాపోయారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతమైన కోసిగిలో చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేస్తే వలసలు నివారించి, ఇక్కడున్న ప్రజలకు ఉపాధి కల్పించాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్తున్న కూలీలు

రైతులకు నష్టపరిహారం అందించాలి

- రైతు సంఘం మండల అధ్యక్షులు కె.వీరేష్

తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. వలసలను నివారించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపించి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి.

'మళ్లీ జగనే ఎందుకు'పై వివరించాలి

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

రాష్ట్రంలో మళ్లీ జగనే ఎందుకు రావాలనే విషయం ప్రజలకు తెలపాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' అనే అంశంపై మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో దొంగ ఓట్ల నమోదు కాకుండా చూడాలని సూచించారు. కర్ణాటక అక్రమ ఓట్ల నమోదును అరికట్టాలని కోరారు. రూ.80 వేల నుంచి రూ.కోటి వెచ్చించి ప్రతి గ్రామంలోనూ సచివాలయాల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఇంటింటి ప్రచారం, సచివాలయాల సందర్శన, పార్టీ జెండా ఆవిష్కరణలు 14 రోజుల పాటు ప్రతి గ్రామంలో జరుగుతాయని చెప్పారు. వీటి ద్వారా గ్రామాల్లో 95 శాతం ఓటు బ్యాంకు వచ్చే అవకాశం ఉందన్నారు. టిడిపి నాయకులు పాలకుర్తి తిక్కారెడ్డి ఏం అభివృద్ధి చేశారని 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో అగ్రిమెంట్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి, మంత్రాలయంలో తాను మళ్లీ అధికారంలోకి రావాలంటే అది మీ చేతిలోనే ఉందని పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి ఇంటింటి ప్రచారం ప్రతి గ్రామంలో జరగాలని కోరారు. వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి, మండల సలహాదారు విశ్వనాథరెడ్డి, కల్లుదేవకుంట వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, మంత్రాలయం సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, రోగప్ప, వ్యవసాయ మండల సభ్యులు మల్లికార్జున, ఉప సర్పంచి పరమేష్, జనార్ధన్ రెడ్డి, ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి, బొంబాయి శివ పాల్గొన్నారు.

మానవత్వాన్ని కాపాడాలి...

పాలస్తీనాపై యుద్ధం ఆపాలి - ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్

ప్రజాశక్తి - కౌతాళం

నిరసన చేపడుతున్న నాయకులు

పాలస్తీనా దేశంలో మానవత్వాన్ని కాపాడి ఆ దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం ఆపాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్, జై భీమ్ నాయకులు అవతారం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. జామియా మసీద్, మసీద్-ఎ-మదీనా, నురానీ మసీద్, మసీద్-ఎ-అక్సాలో ప్రార్థన ముగించుకొని గ్రామంలోని ఖాదర్ లింగ స్వామి దర్గా, పాతబస్టాండ్, ఎల్లప్ప సర్కిల్, కొత్తబస్టాండ్ మీదుగా వైఎస్ఆర్, అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాస్తారోకో నిర్వహించి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ యుద్ధంలో చిన్నపిల్లలు, వృద్ధులు, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. భారతదేశం శాంతిని కోరుకుంటే, పాలకులు ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. పాలస్తీనాపై ఉగ్రవాదుల నిందలు వేసి ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపిస్తోందని పేర్కొన్నారు. యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పాలని పాలస్తీనాకు మద్దతుగా ప్రపంచంలోని అనేక దేశాలు ముందుకు వచ్చాయని తెలిపారు. అనేక దేశాల్లో శాంతి ర్యాలీలు నిర్వహించి పాలస్తీనాకు మద్దతుగా నిలుస్తున్నాయన్నారు. దీనిపై ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. జై భీమ్ నాయకులు, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, మాజీ సర్పంచి అవతారం మద్దతు తెలికారు. ఖాజా హుస్సేన్, యాసర్ బాష, హఫీజ్ హుస్సేన్, ఖురేషి మహబూబ్, మాసుం బాష, ఖాదర్ బాష, సయ్యద్ దూద్ బాష, లడ్డు ఖాదర్ పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి సిఎంను చేద్దాం

- గుమ్మనూరు సోదరులు

ప్రజాశక్తి- దేవనకొండ

సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మనూరు సోదరులు

రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జయరామ్ సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సొసైటీ ఫంక్షన్ హాలులో 'రాష్ట్రానికి సిఎం జగన్మోహన్ రెడ్డి ఎందుకు కావాలి' అనే అంశంపై సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 9 నుంచి సచివాలయాల్లో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రతి ఇంటికీ వెళ్లేలా సమాయత్తం కావాలని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాకర్ల శాంతి కుమార్, ఎంపిపి భర్త లుముంబా, జెసిఎస్ కన్వీనర్ రాజారెడ్డి, వైసిపి మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, రాఘవేంద్ర, ఈరన్న, కందనాతి రంగన్న పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని పల్లెదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రసిద్ధి చెందిన గద్దెరాళ్ల మారెమ్మ దేవాలయ పునఃనిర్మాణానికి, ప్రాకార గోడ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జయరామ్ సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం దేవదాయ శాఖ శ్రేయ నిధి నుంచి, దాతల సహకారంతో మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ రూ.1.17 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి రంగస్వామి, ఎంపిపి భర్త లుముంబ, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, వైసిపి నాయకులు ప్రకభాకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, పల్లెదొడ్డి చంద్ర, జెసిఎస్ మండల కన్వీనర్ రాజారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు సర్వే

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషన్ సర్వేలో భాగంగా మండలంలో శుక్రవారం 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. 4వ వార్డు ఎంపిపి పాఠశాలలో 3వ తరగతి విద్యార్థులు 30 మందికి లెక్కలు, తెలుగు సబ్జెక్టుల్లో ఒఎంఆర్ షీట్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జంబులింగయ్య మాట్లాడారు. ప్రతేడాది లాగానే శ్యాంపిల్ సర్వే పరీక్షలు రాసిన విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకొని అందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలు మార్చడం, లేదా ఉపాధ్యాయులకు ట్రైనింగ్ ఇస్తారని తెలిపారు. మండలంలో 27 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతుల్లో తరగతికి 30 మంది చొప్పున 810 మంది పరీక్షలు రాశారన్నారు. వీరికి డిగ్రీ చదివిన విద్యార్థులు 41 మంది ఇన్విజిలేటర్లుగా నియమించారన్నారు.

ఆరోగ్యశ్రీ యాప్ నమోదు పూర్తి కావాలి

- పంచాయతీ కార్యదర్శి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆరోగ్యశ్రీ కార్డు పొందిన ప్రతి కుటుంబ వివరాలను ఆరోగ్యశ్రీ యాప్‌లో వంద శాతం నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శి బాలన్న, సచివాలయ ఎఎన్ఎం సువర్ణ వాలంటీర్లకు సూచించారు. శుక్రవారం నేమకల్లు సచివాలయ కార్యాలయంలో వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బాలన్న మాట్లాడారు. కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని, ఆరోగ్యశ్రీ కార్డు పొందిన వారి వివరాలను యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. నిర్దేశించిన పనులను నిర్వర్తించకపోతే ఎలా అని మండిపడ్డారు. సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

పని చేయని వాలంటీర్లకు తొలగింపు నోటీసులు

నేమకల్లు పంచాయతీలో 23 మంది వాలంటీర్లు ఉండగా, నలుగురు వాలంటీర్లు ఉన్నతాధికారులు నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడంతో ఎంపిడిఒ సి.వి.కొండయ్య ఆదేశాలతో తొలగింపు నోటీసులను అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి బాలన్న తెలిపారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి

- కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీల సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఆదోని

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27, 28న విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని వక్తలు కోరారు. శుక్రవారం ఆదోనిలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఎఐటియుసి పట్టణ కార్యదర్శి వెంకన్న అధ్యక్షతన కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు చేసి నాలుగు కోడ్‌లుగా విభజించడం వల్ల కార్మికులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. చలో విజయవాడలో కార్యాచరణ రూపొందించి దశలవారీ ఆందోళనలకు సిద్ధమవుతామన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.అజయ్ బాబు, ఐఎన్‌టియుసి జిల్లా నాయకులు దేవిశెట్టి ప్రకాష్, రైతుసంఘం జిల్లా నాయకులు లక్ష్మారెడ్డి, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, లక్ష్మన్న, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎంకప్ప, రైతు కూలీ సంఘం నాయకులు మల్లికార్జున, ఐఎఫ్‌టియు పట్టణ కార్యదర్శి చెన్నకేశవులు, ఎఐటియుసి ఒ.బి.నాగరాజు, కల్లుబావి రాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. రాష్ట్ర ప్రజల హక్కు

- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

విశాఖ ఉక్కు, రాష్ట్ర ప్రజల హక్కు అని, ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరులోని రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సదస్సు నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైనా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నగేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షబ్బీర్ మాట్లాడారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరణను విరమించుకోవాలని జరుగుతున్న పోరాటం ఈనెల 8 నాటికి వెయ్యి రోజులు పూర్తవుతుందని తెలిపారు. వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయని చెప్పారు. లాభాలు వస్తున్నా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరించాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతం కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో పేర్కొన్న హామీ ఇంతవరకు అమలు చేయలేదని తెలిపారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటయితే లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పోతురాజు, మండల ఉపాధ్యక్షులు గిరి మూర్తి, హరికృష్ణ, మండల సహాయ కార్యదర్శి మహేష్, బసవరాజు, పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరంగ, మండల కార్యదర్శి మోహన్ నాయక్, అధ్యక్షులు దుర్గాప్రసాద్, ఎఐవైఎఫ్ జిల్లా సభ్యులు రమేష్ పాల్గొన్నారు. **ఆదోని**లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్ బాష, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు భరత్ కుమార్, పిడిఎస్‌యు జిల్లా కోశాధికారి సోమశేఖర్, పిడిఎస్ఒ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖండ, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పగడాల రమేష్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వమే నిధులు వెచ్చించి కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ డివిజన్ సహాయ కార్యదర్శి జై, మల్లికార్జున, వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు వీరేంద్ర, రవి, కిషోర్, ప్రవీణ్, సాయి, నాగేష్, విష్ణు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమా

మహిళా ఓటర్లపై మళ్లీ సర్వే

- ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రమా

ప్రజాశక్తి - మంత్రాలయం

ఓటరు జాబితాలో మహిళా ఓటర్లపై మళ్లీ సర్వే జరగాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా ప్రకారం మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని తెలిపారు. దానిపై దృష్టి సారించాలని కోరారు. గ్రామాల్లో మహిళలు పెళ్లయి మెట్టినింటికి వెళ్లినా పేర్లు తొలగించకుండా ఉండొచ్చని సూచించారు. సమగ్రంగా సర్వే జరగాలని, లేకపోతే బిఎల్ఒలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రక్షాళనతో సరైన ఓటరు జాబితా తయారీకి సహకరించాలని కోరారు. కౌతాళం, పెద్దకడబూరు తహశీల్దార్లు గైర్హాజరు కాగా కోసిగి తహశీల్దార్ రుద్రగౌడు, డిప్యూటీ తహశీల్దార్లు శశిశేఖర్, రాఘవేంద్ర, బిఎల్ఒలు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సి.గోవిందు, బి.రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఆటో కార్మికులపై కోట్లాది రూపాయల భారం వేశాయని తెలిపారు. రాష్ట్రంలో జిఒ 21 ద్వారా ప్రభుత్వం పెనాల్టీలను వసూలు చేస్తోందని, ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయలేకపోయారన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. మహానంది, గణేష్, విజయ్ కుమార్, రాజు, నరసింహులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగు నీరివ్వాలి

- జెసికి సిపిఎం వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో ప్రతి ఎకరాకూ సాగునీరిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, సీనియర్ నాయకులు శ్రీరాములు కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మండల రైతులు కరువును ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. హంద్రీనీవా నుంచి మండలంలోని ప్రతి ఎకరాకూ సాగునీరిచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందనలో జెసి నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హంద్రీనీవాకు గుండ్లకొండ దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేస్తే గుండ్లకొండ నుంచి కోటకొండ, మాచాపురం గ్రామాల వరకు సాగునీరు ఇవ్వచ్చని తెలిపారు. దశాబ్దం గడుస్తున్న హంద్రీ నీవా పనులు పెండింగ్‌లో ఉన్నాయని, రైతులకు సాగునీరు ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని చెప్పారు. హంద్రీనీవా పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. హంద్రీనీవాకు పంట కాలువల నిర్మాణం పూర్తి చేసి 46 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో కోటకొండ, బేతపల్లి మధ్య అధ్వానమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. దేవనకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచి 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు. కోటకొండలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలని, మండలంలో మోడల్ స్కూల్, డిఎన్‌టి హాస్టల్ పునరుద్ధరణ, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. స్టేట్ బ్యాంకు ఏర్పాటు చేయాలని, తెర్నేకల్, కోటకొండలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని తెలిపారు. దేవనకొండ, తెర్నేకల్, కుంకనూరు శ్మశాన వాటికల సమస్యను పరిష్కరించాలని, డ్రెయినేజీ, సిసి రోడ్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు యూసుఫ్, నాగేష్, శ్రీనివాసులు, రసూల్, వీరేంద్ర, నాగరాజు, రాయుడు, నాగేంద్ర, మహేంద్ర, రైతులు జయచంద్ర, శ్రీనివాసులు, కృష్ణ, మార్కండేయులు పాల్గొన్నారు.

జెసికి వినతి పత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్

ప్రభుత్వ నిబంధనలకు లోబడి మెలగాలి : విజిలెన్స్ ఎస్పీ పూజిత

ప్రజాశక్తి - ఆదోని

ప్రజారోగ్యం దృష్ట్యా హోటళ్ల యజమానులు ఆహార విషయంలో ప్రభుత్వ నిబంధనల మేరకు మెలగాలని విజిలెన్స్ ఎస్పీ పూజిత, సిఐ సునీల్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ సూచించారు. శుక్రవారం ఆదోనిలోని ద్వారక ఫంక్షన్ హాలులో అగ్రికల్చర్ ఫర్టిలైజర్, హోటల్ రంగానికి సంబంధించిన వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు వ్యాపారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నాణ్యతను పాటించాలని సూచించారు. నాణ్యత గల పంటలు పండాలంటే నాణ్యత గల ఎరువులు, మందులు రైతులకు అందించాలని తెలిపారు. ఆహారాల తయారీ విషయంలో వ్యాపారులు నిబంధనలు పాటించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఫర్టిలైజర్ అగ్రి జిల్లా అధ్యక్షులు అశోక్ నంద్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, ఆదోని గౌరవాధ్యక్షులు కెబి.రాజు స్వామి, కార్యదర్శి టి.వీరేష్, జె.ప్రవీణ్, ఎన్‌కె.సోమశేఖర్ ఉన్నారు.

'ఆయకట్టుదారులకు సాగునీరివ్వాలి'

ప్రజాశక్తి - కోసిగి

ఎఇతో మాట్లాడుతున్న మురళీ మోహన్ రెడ్డి

ఆయకట్టుదారులు సాగు చేసిన పంటలు చివరి దశలో ఉన్నందున సాగునీటిని పుష్కలంగా అందించాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పి.మురళీ మోహన్ రెడ్డి అధికారులను కోరారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం పి.మురళీమోహన్ రెడ్డి నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఎఇ రాజేష్‌ను కలిసి సాగునీటిపై చర్చించారు. మండలంలోని 6, 7, 8, 9ఎల్ కాలువలు, నారాయణపురం డిస్ట్రిబ్యూట్, ఎంబిఆర్, గురురాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా దుద్ది, మూగలదొడ్డి రిజర్వాయర్ ద్వారా రైతులకు అందిస్తున్న సాగునీటిని నిలిపేశారని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సాగునీటిని రెండురోజులు అందిస్తామని చెప్పారు. అనంతరం మురళీమోహన్ రెడ్డి అయకట్టు దారులకు సాగునీరందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎంపిపి ఈరన్న, నాడిగేని నరసింహులు, ఎన్.నాగరాజు, జంపాపురం బసిరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ ఇంజిన్ ధ్వంసం

ఆదోని : పంటకు సాగునీరందించేందుకు ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజిన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని బాధితులు శుక్రవారం వాపోయారు. పట్టణంలోని పర్వతాపురంలో పంట పొలాలకు నీరందించే ఇంజిన్‌ను ధ్వంసం చేశారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని రైతు సుజాతమ్మ కోరారు. వర్షాల్లేక పంటలు ఎండిపోతుంటే నీళ్లు కట్టుకునేందుకు ఇంజిన్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రాత్రి ఒంటిగంట సమయంలో ధ్వంసం చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 5వ వార్డులో 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరే విధంగా చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. అధికార వైసిపి వైఫల్యాలను, కక్ష సాధింపు చర్యల గురించి ప్రజలకు వివరించారు.

ఇంటింటి ప్రచారం చేస్తున్న బీవీ

IN THE COURT OF THE HON'BLE 2 ADDITIONAL DISTRICT JUDGE: KURNOOL AT ADONI.

EP. No: 575/2018 IN ARB.No: 134/2013

Between:
M/s. Sundram Finance Ltd., Rep. by its Branch Manager and Authorized Signatory
Mr. PLakshmipathi Raju. ...D.Hr

V/s

P.V.Vikranth Reddy and others. ...Dr's

To,
1) P.V.Vikranth Reddy S/o. P.Durga Prasad Reddy, (I.Dr.No.1) Hindu, Major, D.No: 82-D, 82-F,82-1, Ramadurgam Village, Chippagirt (M), Kurnool District.
2) Nandusekhar Reddy, S/o, N.Loki Reddy, Hindu, Major, (1.Dr.No.2) D.No:2-283, Nagardona (V), Chippagiri (M), Kurnool District.

Notice Under Order 21 Rule 66 of C.P.C. Judgment Debtors No.1 & 2

Please take notice that Under Order 21 rule 66 of CPC of EP. Scheduled mentioned properties for recovery of EP. Amount against both of you. Therefore, both of you hereby take sale notice and appear before this Hon'ble Court on 17/11/2003 at about 10-30 A.M. either in person or through an Advocate to file objection if any. Failing which the matter will be decided in your absence.

SCHEDULE

Item No.1:- Property belongs to J.dr.No.1,
Land situated within the Reg, District of Kurnool and Sub- Registration of Alur in the village of Ramadurgam Gramapanchayath of Ramaduram Village in Chippagiri Mandalam with in the following particulars
Survey No: 82/D. Extent: Ac. 1.85 Cents
Boundaries: East: Land of Girappa **West:** Road.
North: Konda. **South:** Land of Harijana Erappa.

Item No.2. Property belongs to J.dr. No.2
Land situated within the Reg., District of Kurnool and Sub- Registration of Alur in the village of Hathibelagal Gramapanchayath of Hathibelagal Village in Alur Mandalam within the following particulars:
Survey No: 513. Extent: Ac. 10.51 Cents
Boundaries: East: Land of Ravindra Reddy
West : Land of Mallikarjuna Goud.
North: Land of Kotla Ranganna Swami.
South: Land of Ediga Ranganna Swami

// By Orders of the Hon'ble Court//

K.VIJAYA BHASKAR REDDY
ADVOCATE FOR D.Hr.
ADONI.

ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ఉద్యమం

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్
- ఘనంగా ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరులో యువతకు ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం ఉద్యమించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ కోరారు. శుక్రవారం డివైఎఫ్ఐ పట్టణ నాయకులు అజిత్ అధ్యక్షతన డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం డివైఎఫ్ఐ పట్టణ నాయకులు వీరేష్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు. పట్టణంలో చాలా ప్రాంతాలు రోడ్డు, విద్యుత్, కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి ఇంట్లో చదువుకున్న యువత ఉన్నప్పటికీ ఉపాధి లేక తల్లిదండ్రులకు భారంగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరేష్ బాబు, వీరేష్, చిన్న, నరసప్ప, వీరేష్, నరసింహ, నరేష్, హరి, రాము, రవి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవనకొండ : విద్యా, ఉపాధి అవకాశాలపై డివైఎఫ్ఐ చేసే ఉద్యమాల్లో యువత కలిసి రావాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. దేవనకొండలోని బస్టాండ్‌లో డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు పెదరాయుడు పతాకాన్ని ఆవిష్కరించారు. డివైఎఫ్ఐ మండల నాయకులు వీరేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ అటకెక్కిందని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాల్లో కోత పెడుతున్నారని తెలిపారు. ఉపాధి కరువై యువత సుదూర ప్రాంతాలకు వలస వెళ్లే దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రతేడాది జాబ్ క్యాలెండర్ అని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేస్తున్నారని విమర్శించారు. రైతుసంఘం, సిఐటియు మండల కార్యదర్శులు సూరి, అశోక్, ప్రజాసంఘాల నాయకులు నాగేష్, యూసుఫ్, శ్రీరాములు, డివైఎఫ్ఐ మండల నాయకులు రసూల్, మహేంద్ర, రాముడు, నాగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

తెలుగు గంగ ఆఫీసు సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

ఊసేలేని జగనన్న టౌన్ షిప్

- స్థల సేకరణకూ నోచని పథకం
- దరఖాస్తుదారుల ఆశలపై నీళ్లు..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రతి మున్సిపాల్టీలో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లు ఏర్పాటు చేస్తామని, వాటిలో స్థలాలు కొనాలనుకున్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది మధ్య తరగతి ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్లు దాటినా ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో ఎమ్మిగనూరులో కాకుండా మిగిలిన ఏడు మున్సిపాల్టీల పరిధిలో ఇంతవరకు స్థల సేకరణే జరగక పోవడంతో పథకం అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో స్మార్ట్ టౌన్ షిప్‌లో స్థలాల కోసం 13 వేల మందికి పైగా మధ్య తరగతి ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 150, 250, 300 గజాలు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ప్రభుత్వం చెప్పింది. లే అవుట్లలో రహదారులకు 30 శాతం, ఖాళీ స్థలాలకు 10 శాతం, మౌలిక వసతులకు 5 శాతం, ఆసుపత్రులు, కమ్యూనిటీ భవనాలకు 1 శాతం చొప్పున స్థలాలు కేటాయిస్తామని గొప్పగా ప్రకటించింది. పాఠశాలలు,

2 ఆసుపత్రులు, నిత్యవసరాలు, బ్యాంకులు, వార్డు సచివాలయం, అంగన్వాడీ కేంద్రాలు, పిల్లలకు ఆట స్థలాలు అందుబాటులో ఉంటాయని చెప్పింది. వీటికితోడు వీధి దీపాలు, డ్రైనేజీ, విద్యుత్తు, సౌర దీపాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామని, ఉద్యానవనాలు ఏర్పాటు చేస్తామని చెప్పడంతో చాలా మంది ప్రజల్లో ఆశలు చిగురించాయి. ఇంత వరకు స్థలాల సేకరణే జరగలేదు. ఈ పథకం ఉంటుందో లేదో తెలియడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మున్సిపాల్టీల్లో స్మార్ట్ టౌన్ షిప్‌కు సుమారు 500 ఎకరాల స్థలం సేకరించాల్సి ఉంది. ఇందులో భాగంగా కర్నూలు నగరపాలక సంస్థతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ పురపాలక సంఘాల శివారు ప్రాంతాల్లో పలుమార్లు అధికారులు వివిధ రకాల భూములను పరిశీలించారు. కొన్ని భూములను గుర్తించి సంబంధిత రైతులతో సమావేశాలు కూడా నిర్వహించారు. భూములు తీసుకుంటే తమ జీవనం ఎలా అని కొందరు రైతులు ప్రశ్నించారు. కర్నూలు, నంద్యాల వంటి పట్టణాల్లో ఎకరా ధర కనిష్ఠంగా రూ.5 కోట్ల వరకు ఉంది. ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ వంటి పట్టణాల్లో ఎకరం ధర రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు, మిగతా మున్సిపాల్టీలో రూ.50 లక్షల నుంచి రూ. కోటి వరకు ధరలు ఉన్నాయి. ఈ ధరలతో కొనుగోలు చేయడానికి ఏడాదిన్నరగా అధికారులు వివిధ ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వానికి నివేదిక కూడా పంపారు. పట్టణాలకు 5 కి.మీల దూరంలో స్థల సేకరణకు చేసిన ప్రయత్నాలు ఎక్కడా ఫలించలేదు. ఇదే సమయంలో నంద్యాల, ఆత్మకూరు, డోన్, ఆదోనిలో అధికారులు గుర్తించిన భూములపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో ఆ ప్రతిపాదనలు తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత ఈ పథకం ఊసే లేకుండాపోయింది.

- రైతు సంఘం నేతల డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

తెలుగు గంగ ఆయకట్టు భూములకు డిసెంబర్ చివరివరకు సాగునీరు ఇవ్వాలని, వారబందీ పద్ధతిద్వారా 10 రోజుల నుండి 15 రోజుల వరకు నీటిని పొడిగించాలని ఎపి రైతు సంఘం, సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని తెలుగుగంగ ఎస్‌ఈ కార్యాలయంలో ఆఫీస్ సూపరిండెంట్‌కు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ. రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు, సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, రైతు సంఘం నాయకులు రాజు, జగదీశ్వర్ రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ గత సంవత్సరం కూడా బండి ఆత్మకూరు, మహానంది, నంద్యాల, శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లో వరి సాగు రైతులు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయారని చెప్పారు. మళ్లీ ఈ సంవత్సరం అప్పులు చేసి పంటలు వేసిన రైతులు సరైన వర్షాలు కురువక, తగినంత సాగునీరు అందక పంటలు ఎండి పోతుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. తెలుగు గంగ కాలువ నుండి వారబందీ పద్ధతి ద్వారా 10 రోజులకు ఒకసారి నీళ్లు ఇస్తున్న కూడా ఆయకట్టు చివరి భూములకు నీరందడం లేదని తెలిపారు. పంటలు చేతికి వచ్చే చివరి రోజులలో సరిపడా నీరు అందించకపోతే పంటలు బొందుపోయి దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నా రన్నారు. కావున వారబందీ పద్ధతి ద్వారా 15 రోజుల వరకు నీరివ్వాలని కోరారు. ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, తెలుగుగంగ అధికారులు వెంటనే స్పందించి రిజర్వాయర్‌లో ఉన్న నీటిని పంట పొలాలన్నింటికి అందించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతులందరినీ సమీకరించి తెలుగు గంగ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఎ.జమాల్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్‌రావు

ఎండిన పంటలపై నివేదిక

- జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర ప్రభుత్వం బనగానపల్లెను కరువు మండలంగా ప్రకటించిందని, ఎండిన పంటలపై నివేదికలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ మోహన్ రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పాతపాడు, పసుపుల , చిన్న రాజుపాలెం గ్రామాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయిన పంటలను ఆయన పరిశీలించారు. పసుపుల గ్రామపంచాయతీ పరిధిలో పత్తి, మొక్కజొన్న, కంది పంటలను, పాతపాడు, చినరాజుపాలెం గ్రామాల్లో కంది, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులు ఎండిన పంటలను జిల్లా వ్యవసాయ అధికారికి చూపించారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి వర్షాలు లేక పంటలు ఎండిపోయాయని, తమను ఆదుకోవాలని రైతులు కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుత పంటల పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. వీలైనంతవరకు పంటలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, ఏఈఓ ఓబులేసు, పసుపల, పాతపాడు గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు కల్పన, స్వామినాథన్, పాతపాడు ఎంపీఈఓ శైలజ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలపై పరీక్ష

తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలపై సర్వే కోసం శుక్రవారం పరీక్షలు నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని కెఎన్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 3, 6, 9 తరగతుల నుండి ఎంపిక చేసిన 30 మంది విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 1116 పాఠశాలల్లో 28938 మంది విద్యార్థులు ఈ సర్వే పరీక్షలో పాల్గొన్నారు. 2232 మంది ఉపాధ్యాయులు, 1116 మంది ప్రధానోపాధ్యాయులకు సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తారని డిఇఒ సుధాకర్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సర్వ శిక్ష అభియాన్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

డోన్ కొండపేటలో కుక్కల బెడద

- మందలుగా వస్తున్న శునకాలు - వారం రోజుల్లో ముగ్గురిపై దాడి
- రెండేళ్ల బాలుడికి తీవ్ర గాయం - మున్సిపల్ అధికారులు స్పందించాలంటున్న స్థానికులు

గుంపులుగా ఉన్న కుక్కలు

కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుడు

ప్రజాశక్తి-డోన్

డోన్ మున్సిపాలిటీ పరిధిలోని కొండపేట డిపో సందు కాలనీ మీసేవ లైన్‌లో కుక్కలు మందలు మందలుగా తిరుగుతున్నాయి. ఒక్కోసారి 20 నుంచి 30 కుక్కలు గుంపుగా వస్తున్నాయి. గత వారంలో ముగ్గురిపై కుక్కలు దాడి చేసి కరిచాయి. అందులో రెండేళ్ల బాలుడు దినకర్ చేతిని కరవడంతో చేతి ఎముక విరిగి తీవ్రగాయమైంది. పరిస్థితి విషమించి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దాదాపు రూ. రెండు లక్షలు ఖర్చు చేశాక కూడా పూర్తిస్థాయిలో బాలుడు కోలుకోలేదు. బాలుడి పరిస్థితిని చూసి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కుక్కల బెడదతో పిల్లలు, వృద్ధులు బయట తిరగడానికి భయపడుతున్నారు. కొండపేట డిపో సందులో ఒక మహిళ అద్దెకు ఉంటున్నారు. ఆమె రెండు కుక్కలను పెంచుకున్నారు. ఆ కుక్కలతో ప్రతిరోజు వీధిలో తిరుగుతారు. ఆ కుక్కల కోసం ఇతర కుక్కలు కూడా వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

కమిషనర్ , ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్తాం

కొండపేట కాశీంవలి డిపో సందు కాలనీలో మీసేవ లైన్‌లో కుక్కల బెడదపై మున్సిపల్ కమిషనర్, ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. కుక్కలకు ఆంటిబైట్ కంట్రోల్ ఆపరేషన్(ఎబిసి ఆపరేషన్) చేసి వాటిని నిబంధనల ప్రకారం యధాస్థానంలో వదిలిపెట్టాలి. అయితే ఎబిసి సెంటర్ డోన్‌లో లేదు కాబట్టి నంద్యాలకు తరలించి చేయించాలి. ఇది కొంత ఖర్చుతో కూడుకున్నదే. మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్‌కు నివేదిస్తాం. వారి నిర్ణయం ప్రకారం చేస్తాం.

-ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌బాబు.

ప్రజలకు ఇబ్బంది కలిగించే కుక్కల సమస్యలను పరిష్కరిస్తాం

కొండపేటతో పాటు మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు ఎక్కడ ఇబ్బంది కలిగించినా ఆ సమస్య పరిష్కారానికి మున్సిపాలిటీ తరపున తక్షణ చర్యలు తీసకుంటాం. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏ సమస్య పరిష్కారానికైనా మా వంతు కృషి చేస్తాం. కొండపేట కాశీంవలి డిపో సందులో కుక్కల బెడద లేకుండా చూస్తాం.

- మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

చల్లా భగీరథ రెడ్డి సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు : దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి అన్నారు. దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి మొదటి వర్థంతి సందర్భంగా శుక్రవారం అవుకులోని ఫామ్ హౌస్‌లో ఆయన సమాధి వద్ద చల్లా శ్రీలక్ష్మి ఇద్దరు కుమారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని తిరుపాల్రెడ్డి, ఎంపీపీ చల్ల రాజశేఖర్ రెడ్డి, రవీంద్రారెడ్డి, జై చంద్రారెడ్డిలు ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చల్లా చరణ్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, చల్లా రామేశ్వర్ రెడ్డి, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అమర్త్యసేన్ జయంతి

ప్రజాశక్తి - బనగానపల్లె : అర్థశాస్త్ర పితామహుడు అమర్త్యసేన్ సేవలు మరువలేనివనిప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ బాబునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం అధ్యాపకులు రామన్న ఆధ్వర్యంలో అమర్త్యసేన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు బడేసాహెబ్, సూర్య నారాయణ రావు, రామకృష్ణ, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 6 లక్షల 25 వేలు చెక్కులను శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సిఎంకు, ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నంద్యాల రెండో పట్టణ అధ్యక్షుడు పున్నా శేషయ్య, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, నాయకులు కిరణ్, లక్ష్మీనారాయణ, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు సిబ్బంది మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని పేర్కొన్నారు. విధినిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యలను తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యడమే లక్ష్యమన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యలను వింటున్న జిల్లా ఎస్‌పి

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రతి సచివాలయం పరిధిలో ఇంటి, కొళాయి, చెత్త పన్ను వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాసుతో కలిసి ఆయా వార్డుల్లోనే సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి మున్సిపాలిటీ రెవిన్యూను పెంచాలని ఆదేశించారు. వార్డులలో పన్నులు కట్టని వారి డేటాను సేకరించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది పనితీరుపై వివరాలు సిడిఎంఎ దగ్గర నేరుగా ఉంటాయని హెచ్చరించారు. సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులపై అరా తీశారు. వార్డులలో డ్రైనేజీ సమస్యలు లేకుండా చూడాలని, నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, మున్సిపాలిటీ అనుమతులు లేకుండా కట్టే భవనాలను గుర్తించి నోటీసులు ఇవ్వాలన్నారు. అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలన్నారు. సమావేశంలో ఇంజనీరింగ్, శానిటేషన్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు సూచించారు. శుక్రవారం నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో రైతులు సాగు చేసిన జొన్న పంటను ఆయన పరిశీలించారు. మండలంలో 1100 హెక్టార్ల విస్తీర్ణంలో జొన్న పంట సాగు చేశారని, ప్రస్తుతం కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణచర్యలు చేపట్టాలన్నారు. 8-10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని పురుగు ఉదతి గమనించాలని తెలిపారు. పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని, గట్లపై కలుపు లేకుండా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విహెచ్ఎ శ్రీనివాస్, సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

జొన్న పంటను పరిశీలిస్తున్న ఎఒ

7న సామాజిక సాధికార బస్సు యాత్ర

- జయప్రదం చేయండి : వైసిపి నేతలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణంలో ఈ నెల 7న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఉమ్మడి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ ఆకేపోగు అమర్నాథ్ రెడ్డి, వైసిపి ఎన్నికల పరిశీలకులు నరసింహారెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డిలు కోరారు. శుక్రవారం స్థానిక గంగుల కార్యాలయ ఆవరణంలో తాలూకాలోని వైసిపి ముఖ్య నాయకులు, ఎంపిపిలు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలతో సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ ఈ నెల 7న సామాజిక సాధికారిక బస్సుయాత్ర నంద్యాల జిల్లాలో మొట్టమొదటగా ఆళ్లగడ్డలోనే జరుగుతుందన్నారు. పెద్ద ఎత్తున ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గత ప్రభుత్వాలు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలను ఓటు బ్యాంకు కోసమే వాడుకున్నాయని, సిఎం జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారందరికీ పెద్దపీట వేసిందన్నారు. జిల్లా అధ్యక్షులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ అందరూ ఒకసారి ఆలోచన చేయాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు లోకల్ బాడీలతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యత పదవుల్లో పెద్దపీట ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర జలవనరుల ప్రభుత్వ సలహాదారులు, మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బస్సు యాత్రతో ఎన్నికల శంఖారావం ప్రారంభమైనట్లేనని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాయబ్ రసూల్, వైసిపి రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గంధం రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి

ఆహారంలో కూరగాయలు తీసుకోవాలి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ప్రతిరోజు కూరగాయలు ఆహారంగా తీసుకోవడం వల్ల శరీరానికి మంచి పోషకాలు లభిస్తాయని గౌతమ్ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గౌతమ్ మోడల్ పాఠశాలలో గ్రీన్ డే, వెజిటబుల్ డే వేడుకలను ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిల్లలకు ఆకుపచ్చ రంగు గుర్తింపులో భాగంగా వివిధ రకాల కూరగాయలను గుర్తించే విధంగా వారికి అవగాహన కల్పించారు.

వచ్చే సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ప్రణాళికలు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు సూచించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎస్‌పిలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎఎస్పీ వెంకటరాముడు, డిఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఈవిఎంలు, వివి ప్యాట్ పరికరాలను భద్ర పరుచుటకు స్ట్రాంగ్ రూమ్‌లు పూర్తి స్థాయిలో భద్రత ప్రమాణాలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దు చెక్ పోస్టుల ఏర్పాటు, కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నామని నివేదించారు. ఎన్నికల నిర్వహణకు మానవ వనరులు, ఎన్నికల సమాగ్రి, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లకు సంబంధించి మ్యాపింగ్, సి విజిల్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమ్యూనికేషన్ ప్లాన్, తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పోలీస్ స్టేషన్ల రేషనలైజేషన్ తదితర అంశాలపై ప్రతివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి సూచనలను పరిగణలోకి తీసుకొని ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించామన్నారు.

పోస్టర్లను ఆవిష్కరించిన విద్యార్థి, యువజన సంఘాలు

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేట్ పరం చేయొద్దని నవంబర్ 8న జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం నాడు బంద్‌కు సంబందించిన పోస్టర్లను నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాసులు, పిడిఎస్‌యు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రాంబాబు, ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్షుడు డక్క కుమార్, ఐసా జిల్లా నాయకుడు రంగస్వామి, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు మద్రిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహానంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని గత దశబ్దం కు పైగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్న, ప్రభుత్వాలు మాత్రం శిలాఫలకాలకే పరిమితం అయ్యాయన్నారు. బ్రాహ్మణీ ఉక్కు పరిశ్రమ పేరుతో భారీ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వం, తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని శంకుస్థానలు, నిర్మాణం పూర్తి చేస్తామని హామీలు మాత్రం ఇస్తూ, చేస్తూ వస్తున్నాయని, చివరికి, తక్కువ సామర్థ్యంతో పరిశ్రమను పూర్తి చేసేందుకు ఇప్పటి ప్రభుత్వం శంకస్తాపన చేసిందన్నారు. చదువుకున్న యువత వలస వెళుతున్నారని, ఇక్కడ నిర్మాణ దశలో ఆగిపోయిన గతంలోని భారీ పరిశ్రమనే పరిశ్రమ పూర్తయితే ఇక్కడ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. అందుకోసం విద్యార్థులు, యువకులు కలిసి ఈనెల 8న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో, జిల్లా నాయకులు నవీన్ , ఎస్ ఎఫ్. ఐ నాయకులు హరివర్ధన్, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పాములపాడును కరువు మండలంగా ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి సామన్న, నాయకులు వెంకటేశ్వరరావు, రంగస్వామి, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయం నందు వారు మాట్లాడుతూ పాములపాడు మండలంలో తక్కువ వర్షపాతం నమోదయిందని, ఖరీఫ్ సీజన్లో పంట ఎదుగుదల సమయంలో కరెక్టుగా నెల రోజులు వర్షం పడకపోవడంతో రైతులు పంటను దున్నేసిన పరిస్థితి ఉందన్నారు. రైతులు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు గడపగడపలో తిరిగి విషయం తెలిసినప్పటికీ పాములపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి మండల పరిస్థితిలను ప్రభుత్వానికి తెలియపరిచి కరువు మండలముగా ప్రకటించాలని వారు కోరారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు పంపిణీ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బైలాపురం మహబూబ్ బాషా

ప్రజాశక్తి - ఆత్మకూర్

రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు పంపిణీ చేయాలని వ్యవసాయ సలహ మండలి చైర్మన్ షేక్ బైరాపురం బాష అధికారులను కోరారు. శుక్రవారం ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు అర్బన్ రైతు భరోసా కేంద్రం నందు గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ పోషకాలు అయినా జింకు, జిప్సం, వ్యవసాయ యాంత్రిక పరికరాలైన హార్వెస్టర్ ట్రాక్టర్లు సబ్సిడీలో ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం సలహ మండలి చైర్మన్ షేక్ బైరాపురం బాష మాట్లాడారు. ప్రస్తుతం వెయ్యబోయే పంటల గురించి మండల వ్యవసాయ అధికారి డి విష్ణువర్ధన్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జి లతమ్మ, బహుళప్రయోజనం విస్తరణాధికారి ఎస్ రవి గౌడ్, శంకర్ నాయక్, వ్యవసాయ సలహా మండలి సభ్యులైన బొల్లుచిన్న లింగమూర్తి, పటాన్ జమాల్ ఖాన్, సముద్రాల శిఖామణి, ఎస్ బాబు పాల్గొన్నారు.

జిల్లా విద్యాధికారులు నిర్లక్ష్యం వీడాలి

- మైనార్టీ నాయకుడు సమద్

ప్రజాశక్తి - నంద్యాల

ఉర్దూ మెరిట్ విద్యార్థుల పట్ల జిల్లా విద్యాధికారులు నిర్లక్ష్యం వీడాలని, ప్రోత్సహకాలకు విద్యార్థుల పేర్లు పంపాలని మైనార్టీ నాయకుడు, జమాఅతె ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 23 జిల్లాలు ఉన్నా నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉర్దూ హైస్కూలు లేవని, మిగతా 20 జల్లాల నుండి 60 మంది ఉర్దూ మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి పంపాల్సి ఉందన్నారు. కేవలం పది జిల్లాల నుండి 30 పేర్లు మాత్రమే రాష్ట్ర అధికారులకు చేరాయని, పలు జిల్లా విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం, ఉర్దూ భాష పట్ల అలసత్వం ఈ ప్రక్రియలో కనిపిస్తుందన్నారు. ఉర్దూ మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలుగా కనీసం రూ.15 వేలు ఇవ్వాలని సమద్ డిమాండ్ చేసారు. స్వతంత్ర ప్రతిపత్తి గల ఉర్దూ అకాడమీకి ఇచ్చే గ్రాంట్స్ షాదిఖానా తదితర వాటికి దారిమళ్ళించకుండా మైనార్టి విద్యార్థుల విద్యాభివృద్ధికి వినియోగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి : టిడిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నంద్యాల పార్లమెంటు ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి కార్యకర్తలను కోరారు. శుక్రవారం స్థానిక బైరెడ్డి శేషశనారెడ్డి నగర్ 15వార్డులో ఇంచార్జ్ గోవర్ధనగిరి, టిడిపి పట్టణ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి వైసిపి టిడిపి సానుభూతి పరుల ఓట్లను తొలగిస్తోందని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఓటు ఓటర్ లిస్టులో ఉందో లేదో చెక్ చేసుకోవాలన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ పథకాల గురి ంచి వివరించారు. ఈ కార్యక్రమంలో జయ సూర్య, షకీల్ అహ్మద్, మృతుజావలి, లాయర్ జాకీర్ హుస్సేన్, ఎస్ఎండి జమీల్, రసూల్ ఖాన్, క్లస్టర్ ఇంచార్జ్ మద్దిలేటి, నిమ్మకాయల మోహన్,రాజు, బోల్లెద్దుల రాజన్న, కళాకర్, ప్రవీణ్ రగడ, ప్రభు కుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి నాయకులు

నందికొట్కూరు పట్టణంలో 26వ వార్డులో మల్లికార్జున్ రెడ్డి వైసీపీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నాడు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారందరికీ మాండ్ర పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలన నచ్చక వారంతా తమ పార్టీలో చేరారన్నారు.

మిడుతూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో టిడిపి ఆధ్వర్యంలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంటు ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, మండల టిడిపి కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే మహాశక్తి పథకంతో మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, తల్లివందనం వంటి పథకాలతో పాటు బీసీలకు రక్షణ చట్టం తెస్తామన్నారు. మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుండం రమణారెడ్డి, హరిసరత్వం రెడ్డి నందికొట్కూరు మాజీ ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, బాష, జయ సూర్య, మాజీ ఎంపిటిసి నారాయణ, బిచ్చన్న, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు : మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి : ధర్మారం

ప్యాపిలి: చంద్రబాబు నాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని డోన్ టిడిపి ఇంచార్జి మన్నె ధర్మారం సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వై నాగేశ్వరావు యాదవ్ అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం వెంగలాంపల్లె గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు టిడిపి మినిమేనిఫెస్టోను వివరించారు. అనంతరం ప్యాపిలి పట్టణంలోని 8వ వార్డ్‌లో బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మురళి కృష్ణగౌడ్, కాటమయ్య, జయశీలమ్మ, రామసుబ్బయ్య, రాంమోహన్ యాదవ్, ప్రసాద్ రెడ్డి, సుదర్శన్,చిన్న సుంకయ్య,కోదండ రామయ్య,రమేష్,బసిరెడ్డి వెంకటేశ్వ రరెడ్డి, రామాంజినేయులు,చల్లా వీర,మల్లికార్జున,సుధాకర్ గుప్తా,విష్ణు, అనుదీప్, ఎస్ కె వలి, పూజారి శివ, అక్బర్, రాజు, లక్ష్మీకాంత్ రెడ్డి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరిన వారితో మాండ్ర

ప్యాపిలి : గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ కార్యకర్తలు

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎం.ఎ రషీద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 13వ సచివాలయ పరిధిలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా ఆరోగ్యలను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టారన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పెనుకొండ శ్రీనివాసరావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, వార్డు కౌన్సిలర్లు రంగస్వామి, పాణ్యం పార్వతి, విజయ్ కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలకు రక్ష అని ఎంపీడీవో శివరామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని యనకండ్ల గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. టంగుటూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు ఆధ్వర్యంలో 1012 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సోహల్, వైసిపి నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, వడ్డే సుబ్బరాయుడు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిపో అభివృద్ధికి అందరి సహకారం అవసరం : డిఎం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆర్‌టిసి డిపో అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని డిఎం రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఏమైనా సమస్య వస్తే క్షణికావేశాలకు, ఓడిదుడుకులకు లోను కాకుండా పరిష్కరించుకొని ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా చర్చల ద్వారా సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకొని ముందుకు సాగాలని సూచించారు. చెడు అలవాట్లకు లోనై వాటి ప్రభావం వల్ల క్షణికాపూరితమైన ఆవేశాలకు లోనై ప్రతికూల చర్యలకు పాల్పడరాదన్నారు. తద్వారా ఉద్యోగులు ఇబ్బందులు పడటమే కాకుండా వారి కుటుంబాలు కూడా గడ్డు పరిస్థితులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. ఉద్యోగాలు కూడా కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఇటీవల ఈస్ట్ గోదావరి జిల్లాలోని తణుకు డిపో పరిధిలో విధి నిర్వహణలో అవగాహన లోపంతో ఉద్యోగుల మధ్య గొడవలు జరిగాయని గుర్తు చేశారు. ఆళ్లగడ్డ డిపో పరిధిలో కార్మికులకు, ఉద్యోగులకు, సిబ్బందికి ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న డిఎం

ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంప్‌లు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూర్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు వంటి సవరణలో చేయుటకు 4,5 తేదీలలో బిఎల్వోలు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారని ఆర్డీవో దాసు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 9 తేదీ లోపల ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు తాసిల్దార్ కార్యాలయంలో సంప్రదించవచ్చని అయిన తెలిపారు.

తాగునీరు అందించండి

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని దాదాపు అన్ని గ్రామాలలోని ప్రజలకు తాగటానికి మంచినీరు అందించాలని బిజెపి జిల్లా కార్యదర్శి వడ్డే మహారాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు ప్రజలకు తాగు నీరు అందించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని బిజెపి కార్యకర్తల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వడ్డే మహారాజు మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో బోర్లు అడుగంటి పోయి ఎన్నడులేనంతగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారన్నారు. జల్ జీవన్ మిషన్ స్థానిక అధికారుల, నాయ కుల నిర్లక్ష్యంతో ఆలస్యం అయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ ఎస్ షేక్షావలికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దాదాగాళ్ల ఆంజనేయులు, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై మద్యం కేసు దుర్మార్గం

ప్రజాశక్తి - చాగలమర్రి

నాలుగున్నరసంవత్సరాలుగా కల్తీ, నాసిరకమైన మద్యం అమ్మి లక్ష కోట్లు దోచుకున్న జగన్ రెడ్డి చంద్రబాబు హయాంలో మద్యం కుంభకోణం జరిగిందంటూ కేసు పెట్టడం దుర్మార్గమని నంద్యాల జిల్లా టిడిపి బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు అన్నారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలో శివాలయం కాలనీలోని టిడిపి కార్యాలయంలో సల్లా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరసగా చంద్ర బాబుపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయడాన్ని దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ నాయ కులు లక్ష్మీనారాయణ గౌడ్, రామతీర్థం, దూదే కుల మహబూబ్ బాషా, బాలదస్తగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సల్లా నాగరాజు

జాతీయస్థాయి పోటీలకు శ్లోక విద్యార్థులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

అక్టోబర్ 25 నుండి 29 తేదీ వరకు నెల్లూరులో నిర్వహించిన సిబిఎస్ఇ సౌత్ జోన్ క్రీడా పోటీలలో నందికొట్కూరు పట్టణంలోని శ్లోక సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు అజయ్ రెడ్డి 800 మీటర్ల రన్నింగ్, షేక్ మహమ్మద్ ముదాస్సిర్ షాట్ పుట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల చైర్మన్ సూది రెడ్డి శ్రీధర్ రెడ్డి, కరెస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 5, 6, 7 తేదీలలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు రాణించాలని అన్నారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ శ్రీధర్ రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాస రెడ్డి, డైరెక్టర్స్ కవిత, శ్రీదేవి రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రవూఫ్ అభినందించారు.

వైసిపికి బుద్ధి చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్రంలో ప్రజలపై అధిక భారాలు మోపుతూ అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఓటుతో బుద్ధి చెప్పి గద్దె దింపాలని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ అధ్యక్షులు మేకల నాగరాజు అన్నారు. బేతంచర్ల పట్టణంలోని కోటపేట నందు బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. డోన్ నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డిని గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్నంద్యాల పార్లమెంట్ అధికార ప్రతినిధి పి రూబెన్, కౌన్సిలర్ రాంగోపాల్, నాగరాజు, మాధవ, మధు, నీ తమ్మ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

ప్రజాశక్తి- చాగలమర్రి

మండలంలోని డి.వనిపెంట పంచాయితీకి మజరా గ్రామమైన డి.కొత్తపల్లె గ్రామంలో వెలసిన రామాలయానికి గ్రామానికి చెందిన ఎరువ పెద్దీశ్వరరెడ్డి, ఏరువ రోసిరెడ్డి, ఏరువ పెద్ద నరసింహారెడ్డి, ఏరువ ప్రతాపరెడ్డిలు ఇచ్చిన సుమారు రూ.3 లక్షల విరాళాలతో అనంతపద్మ నాభస్వామి, విఘ్నేశ్వరుడు, లక్ష్మీదేవి విగ్రహాలతో ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం దేవస్థానం అర్చకులు వెల్లాల జనా ర్ధనశర్మ, సంపత్ శర్మల ఆధ్వర్యంలో రామాలయంలో పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన మహిళా బృందంచే కోలాటం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

క్రేన్ సహాయంతో విగ్రహాలు ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

కిట్ల పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

అల్లూరులో 'ఎపికి జగన్ ఎందుకు కావాలంటే..'

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి నేతృత్వంలో బిజినవేముల సర్పంచ్ రవి యాదవ్, మండల కన్వీనర్ ఓంకార్ రెడ్డిల ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి అల్లూరు ప్రభాకర్ రెడ్డి హాజరై కిట్లు పంపిణీ చేశారు. ప్రజల ముందుకు వెళ్లి జగనన్న చేసిన సంక్షేమ అభివృద్ధిని వారికి వివరించాలని అన్నారు. జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో అందరమూ కలిసి పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పబ్బతి రవి, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచులు యేసు రత్నం, సురేష్ యాదవ్, గృహ సారథులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో ఆర్జిత అభిషేకాల నిలుపుదల

ప్రజాశక్తి - శ్రీశైలం

నవంబర్ 14వ తేదీ నుండి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీక మాసం సందర్భంగా శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు సాధారణ భక్తులకు కార్తీక మాసంలో ఆర్జిత అభి షేకాలు నిలుపుదల నిలుపుదల చేయడం జరిగిందని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెద్దిరాజు తెలిపారు. శుక్రవారం ఇఒ మాట్లాడుతూ కార్తీక మాసం అంతా భక్తుల రద్దీ కారణంగా పూర్తిగా ఆర్జిత అభిషేకాలు నిలుపుదల చేయడం జరిగిందన్నారు. రద్దీ రోజుల్లో స్వామి వారి స్పర్శ దర్శనం నిలుపుదల చేసి అలంకార దర్శనం ఏర్పాటు చేయడం జరుగుతు ందని, సాధారణ రోజులలో నిర్దిష్ట వేళల్లో రోజుకు నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శ దర్శనం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. స్పర్శ దర్శనం , ఇతర సేవలు ఆన్లైన్లో అందుబాటులో ఉన్నాయన్నారు. గంట ముందు వరకు ఆన్లైన్లో టికెట్లను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు.

బోటులో వంతెన నిర్మించే ప్రదేశానికి వెళ్తున్న డిజి

ఐకాన్ వంతెన ప్రదేశాన్ని పరిశీలించిన ఫైర్ సర్వీస్ డిజి

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న కృష్ణానది సమీపంలో నిర్మించాల్సిన వంతెన ప్రదేశాన్ని ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ మద్ది రెడ్డి ప్రతాప్ పరిశీలన చేశారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని సప్త నదుల సంగమేశ్వర క్షేత్రాన్ని దర్శించుకుని పలు విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కృష్ణా నదిలో బోటు ద్వారా ఐకాన్ వంతెన నిర్మించే ప్రదేశాన్ని స్థానిక పోలీస్ రెవెన్యూ అధికారులతో కలిసి బోటులో తిరిగి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం డిజి మాట్లాడుతూ త్వరలో నిర్మించబోయే ఐకాన్ వంతెన ప్రదేశాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. రెండు రాష్ట్రాల మధ్య వంతెన నిర్మించే ఇరు ప్రాంతాలను బోటులోనే పరిశీలించి పూర్తి సమాచారాన్ని తెలుసుకోవడం జరిగిందన్నారు. ఇక్కడి సమాచారాన్ని ఉన్నతాధికారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే కృష్ణా నదిలో ఉన్న పాత సంగమేశ్వరుడి ఆలయం చుట్టూ బోటులో తిరిగి ఈ ప్రదేశంలో పర్యాటక అభివృద్ధికి చేయవలసిన పనులను గురించి అడిగి తెలుసు కోవడం జరిగిందన్నారు. అనంతరం సప్త నదుల క్షేత్రం పరిసర ప్రాంతంలో కనుచూపుమేరలో ఉన్న కృష్ణమ్మ పరవళ్ళు సమీపంలోనే దట్టమైన అడవుల్లో ఉన్న పచ్చని ప్రకృతి అందంగా ఉన్నాయన్నారు. వీరి వెంట ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు, సీఐ నాగభూషణ్, తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎస్సై హుస్సేన్ బాష, పలువురు సిబ్బంది ఉన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

- వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఈనెల ఆరవ తేదీ నుండి జరుగుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పర్యటనను వైసిపి కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని బేతంచెర్ల మండల వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అయ్యల చెరువు నుండి బనగాలపల్లి రోడ్డులో గల కస్తూరిబా బాలికల కళాశాల, బేతంచెర్ల డోన్ క్రాస్ రోడ్డు నుండి హెచ్ కొటాల గ్రామం వరకు పూర్తయిన నాలుగు లైన్ల రహదారులను మంత్రి బుగ్గన ప్రారంభిస్తా రన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బుక్ లెట్ ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు

రాష్ట్రంలోని అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించటమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్రవారం అవుకు పట్టణంలోని సచివాలయం–2 పరిధిలోని వార్డులలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైసిపి యువ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డిలతో కలిసి మండపం వీధి, ఎస్సీ కాలనీ, కోట వీధి ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల బుక్లెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డి, యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, ఉప సర్పంచి చల్లా రఘునాథరెడ్డి, మాజీ సర్పంచి దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జై.చంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, బలిజ సంఘం అధ్యక్షుడు రామన్న, కృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

నగదును అందజేస్తున్న వైసిపి నాయకులు, అధికారులు

కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గ్రామంలో పికిలి కంబగిరి అనారోగ్యంతో మరణించడంతో అతని భార్య పిక్కిలి తిరుపాలమ్మకు వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలు వైసిపి నాయకులు మొలక హుస్సేన్ యాదవ్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ లావణ్య దేవి, వైసిపి నాయకులు మొలక హుస్సేన్ యాదవ్, వాలంటీర్ పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలి : పిడి

ప్రజాశక్తి పాములపాడు

ప్రభుత్వ పథకాలను మహిళలు సద్విని చేసుకోవాలని పిడి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాములపాడు మండలం జూటూరు గ్రామంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎం ఈజిపి)లో భాగంగా చిలుకల వెంకటరవణమ్మకు రూ.1,06,000 మంజూరు కాగా వెంకటరమణ ఏర్పాటు చేసిన జిరాక్స్ మిషన్, లామినేషన్ నూతన షాపును పిడి శ్రీధర్ రెడ్డి, ఏసీ పుల్లయ్య, కృష్ణరావుపేట బ్యాంకు మేనేజర్ తిమ్మప్ప, గ్రామ నాయకులు యన్. మద్దిలేటి రిబ్బన్ కట్ చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ మహిళలు చిన్న వ్యాపారాల ద్వారా అభివృద్ధి చెందాలన్నారు. వెంకట రవణమ్మకు రూ.35000 రాయితీ వర్తిస్తుందని, ఇలాంటి అవకాశాలను మహిళలు వినియోగించుకొని అభి వృద్ధి చెందాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం అనురాధ, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, సిసి సౌజన్య పాల్గొన్నారు.

నూతన షాప్‌ను ప్రారంభించిన పిడి